క్లుప్తంగా

'నవీన్ కుటుంబానికి అండగా ఉంటాం'

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటకు చెందిన పైనం నవీన్ కుటుంబానికి అండగా ఉంటామని జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. నవీన్ అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన వారికి ఆస్పత్రి ఖర్చుల కోసం రూ.10 వేలు మృతుడి ముగ్గురు ఆడ పిల్లల చదువుల కోసం రూ.30 వేలు బ్యాంకు డిపాజిట్ చేయాలని నగదు అందజేశారు. అలాగే పీఎంజీ యువసేన సభ్యులు జమ చేసిన రూ. 50 వేలు బాధిత కుటుంబానికి అందజేశారు.

బీజేపీ గెలుపునకు కృషి



మాట్లాడుతున్న విఠల్

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణ ఖేడ్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపునకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్ అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపు కోసం ప్రతీ ఒక్కరూ ఇంటింటి ప్రచారం చేపట్టాలని, కేంద్రం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధాకర్, నాయకులు శ్రావణ్, శ్రీనివాస్, దమ్ము సాయిలు, కృష్ణ, అనిల్ పాల్గొన్నారు.

'మాదిగల యుద్ధ భేరి'ని విజయవంతం చేయండి

రామాయంపేట(మెదక్): హైదరాబాదులో ఈనెల 5న నిర్వహించనున్న మాదిగల యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం సంఘం ప్రతినిధిలో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘం సభ్యులు విధిగా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గరుగుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి సంజీవ్, రామాయంపేట మండలాధ్యక్షుడు రాజేందర్, నాయకులు రాకేశ్, అరుణ్, తదితరులు హాజరయ్యారు.

విద్యుత్ వినియోగదారుల దినోత్సవం



ఫిర్యాదును పరిశీలిస్తున్న అధికారులు

మెదక్ కలెక్టరేట్: మెదక్ విద్యుత్ శాఖ సర్కిల్ కార్యాలయం, డివిజన్ కార్యాలయాల్లో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్, హవేళిఘనాపూర్, నర్సాపూర్, కొల్చారం మండలాల వినియోగదారులు తమ సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు అందజేశారు. వారి అభ్యర్థనలను సూపరింటెండెంట్ ఇంజనీర్ పి. జానకి రాములు, టెక్నికల్ డివిజనల్ ఇంజనీర్ రాంబాబు, ఆపరేషన్ డివిజనల్ ఇంజనీర్ కృష్ణారావు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

పద్మాదేవేందర్‌రెడ్డికి నిరసన సెగ



నిరసన వ్యక్తం చేస్తున్న యువకులను సముదాయిస్తున్న పోలీసులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చెన్నాయిపల్లి గ్రామంలో మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభలో గ్రామ యువకులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని చెన్నాయిపల్లి గ్రామంలో ఎన్నికల సభలో పద్మాదేవేందర్ రెడ్డి మాట్లాడుతుండగా.. గ్రామానికి చెందిన కొందరు యువకులు అడ్డుపడి నిరసన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు మైనంపల్లి సోషల్ సర్వీస్ ద్వారా బోరువేసేందుకు వస్తే అడ్డుకున్నారని యువకులు ఆరోపించారు. తమ గ్రామంలో గృహలక్ష్మి పథకంలోను పక్షపాతం చూపారని తెలిపారు. అనంతరం పోలీస్‌లు యువకులు సముదాయించి పక్కకు తీసుకువెళ్లారు. మైనంపల్లి గ్రామాల్లో చిచ్చుపెట్టాలని చూస్తున్నారన్నారు.

కొంత మందికే రుణమాఫీ

- మండల సమావేశంలో వ్యవసాయ అధికారి సతీశ్



మాట్లాడుతున్న ఎంపీపీ సిద్ధరాములు

నిజాంపేట(మెదక్): కొంత మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని మండల వ్యవసాయ అధికారి సతీశ్ అన్నారు. మండల కేంద్రం నిజాంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ దేశెట్టి సిద్ధరాములు అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. మండలంలో మొత్తం 14845 ఎకరాల వరి సాగు చేశారని తెలిపారు. ఇందులో 3,75,130 క్వింటాళ్ల ధాన్యం పంట పండిందన్నారు. కొంత మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. అనంతరం మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళా గ్రూపులకు సంబంధించి మండలంలోని మొత్తం 573 మహిళా సంఘాల్లో 6188 మంది మహిళలు ఉన్నారని అన్నారు. ఇప్పటి వరకు 79 సంఘాలకు రూ.5.97 కోట్లు, స్త్రీ నిధి 31 సంఘాలకు 40లక్షలు అందించామన్నారు. అనంతరం వెటర్నరీ, విద్యుత్, మిషన్ భగీరథ, శాఖల అధికారులు వారి శాఖల వివరాలు సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అందే ఇందిరా, ఎంపీడీఓ జగదీశ్వర్‌చారి, వ్యవసాయ అధికారి సతీశ్, సీనియర్ అసిస్టెంట్ వినయ్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు అమరసేనారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు అరుణ్, అనిల్, చంద్రవర్దిని, ఎంపీటీసీ లహరిరెడ్డి, సురేశ్, భాగ్యలక్ష్మి, సొసైటీ చైర్మన్‌లు కొండల్‌రెడ్డి, బాపురెడ్డి, మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి, ఇరిగేషన్ ఆఫీసర్ శరత్, ఐసీడీఎస్ లక్ష్మి, వెటర్నరీ డాక్టర్ సుధాకర్, బీట్ ఆఫీసర్ రాము, వివిధ శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి

నర్సాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన వారితో సునీతారెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్రంలోని అన్నివర్గాల వారికి అభివృద్ధి, సంక్షేమాన్ని అందించిన ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందని నర్సాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం వెల్దుర్తి జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మండలంలోని భస్వాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గోమారంలో ఆమె సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నర్సింలు, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింలు పాల్గొన్నారు.

సునీతారెడ్డిని కలిసిన నాయకులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఏటిగడ్డ మాందాపూర్, తుక్కాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సునీతారెడ్డిని కలిసి వారి సంపూర్ణ మద్దతును తెలిపినట్లు నాయకులు పేర్కొన్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని బద్యాతండాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, చిట్కుల్ గ్రామ అధ్యక్షుడు నారాగౌడ్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న క్రాంతికిరణ్

టేక్మాల్(మెదక్): అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అందోల్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్ కోరారు. మండలంలోని బొడ్మట్‌పల్లి గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు క్రాంతికిరణ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కారు గుర్తుకు ఓటు వేసి తనను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ స్వరూప దశరథ్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఈశ్వరప్ప, మండల ప్రధాన కార్యదర్శి అవినాష్, నాయకులు అంజయ్య, రవిశంకర్, విఠల్, సాయిబాబా, వీరప్ప, రాజుగౌడ్, నర్సింలు, కిష్టయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఈసారి బీసీని గెలిపించండి

- మాది జనబలం, వారిది ధనబలం
- నర్సాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీయాదవ్



గౌతాపూర్‌లో ప్రచారం చేస్తున్న మురళీయాదవ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): నర్సాపూర్ నియోజకవర్గంలో 40 ఏళ్లుగా ఒకే సామాజిక వర్గానికే పరిమితమైందని, ఈసారి బీసీని గెలిపించాలని నర్సాపూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మురళీయాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని చాముండేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాది జనబలం, వారిది ధనబలం అని, ఈసారి బీసీని గెలిపించండి రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కేసీఆర్ దళిత ముఖ్యమంత్రిని చేస్తానని, ఆయనే ముఖ్యమంత్రిగా కొనసాగుతుతున్నాడని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రి ఖాయమన్నారు. నియోజకవర్గంలో డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు, బీసీ బంధు, రుణమాఫీ సక్రమంగా జరగడం లేదన్నారు. ఈ ప్రభుత్వంలో గ్రామాల్లో తాగడానికి నీళ్లు దొరకడం లేదు, కానీ మద్యం దొరుకుతుందన్నారు. టీఆర్ఎస్ అంటే ప్రజలు ఓట్లేయ్యరని, బీఆర్ఎస్‌గా మార్చారన్నారు. సునీతారెడ్డి అధికారంలో ఉన్నంత కాలం నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. నర్సాపూర్ నియోజక వర్గం 40 ఏళ్లుగా ఒకే సామాజిక వర్గానికే పరిమితమైందని, ఈసారి బీసీని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్, అజ్జమర్రి మాజీ సర్పంచ్ నాగేశ్‌యాదవ్, నాయకులు సంతోష్, కిషన్‌నాయక్, ఆనంద్, ఈశ్వర్, మధు, తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలను అడ్డుకుంటాం

పాపన్నపేట(మెదక్): కాంగ్రెస్ మేనిఫెస్టోపై అసత్య ఆరోపణలు చేసే బీఆర్ఎస్ ప్రచారాన్ని అడ్డుకుంటామని కాంగ్రెస్ జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని ప్రకటించగా, దాన్ని ఒక్కో రైతుకు ఎంత భూమి ఉన్నా.. రూ.15 వేలు ఇస్తున్నారని అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని రైతులు గుర్తించాలని కోరారు. తమ పార్టీ ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతుబంధు చెల్లిస్తుందని చెప్పారు. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అసత్యపు ప్రచారాలు మానుకోవాలని కోరారు. మొదట మేనిఫెస్టో చదివి విమర్శలు చేయాలన్నారు.

రాజీనామా

రామాయంపేట(మెదక్): రామాయంపేట మండలంలోని పర్వతాపూర్ లఖ్యతండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ బానోత్ చందర్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్ష పదవికి, పార్టీకి తన వ్యతిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడి మృతి



మోహన్(ఫైల్)

పెద్దశంకరంపేట(మెదక్): చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బూర్గుపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన నీరుడి మోహన్(32) అనే యువకుడు గ్రామశివారులో చేపలు పట్టేందుకు వెళ్లి అదుపుతప్పి చెరువులో పడి నీటమునిగి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.

'టికెట్ అమ్ముకున్న కాంగ్రెస్'

నర్సాపూర్: పార్టీ అధిష్టానం నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే టికెట్‌ను అమ్ముకున్నారని పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా నర్సాపూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రిజ్వాన్, వెల్దుర్తి మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఎంపీపీ అధ్యక్షురాలు జ్యోతి సురేశ్‌నాయక్ తదితరులు మాట్లాడుతూ.. నర్సాపూర్ కాంగ్రెస్ టికెట్‌ను ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి, నర్సాపూర్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి నుంచి రూ.20కోట్లతో పాటు కొంత వ్యవసాయ భూమి తీసుకొని టికెట్‌ను అమ్ముకున్నారని ఆరోపించారు. ఆవుల రాజిరెడ్డి, సునీతారెడ్డికి కోవర్టుగా పని చేస్తున్నారని అన్నారు. అభ్యర్థిని మార్చాలని పార్టీ కార్యాలయం ఎదుట వంశీచంద్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో రిజ్వాన్, జ్యోతి, నర్సింగ్‌రావు, సురేశ్‌నాయక్, మహేందర్‌రెడ్డి, భరత్‌గౌడ్, రాజు, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



పార్టీలో చేరిన వారితో దామోదర రాజనర్సింహ

- అందోల్ కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ

అల్లాదుర్గం(మెదక్): కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అందోల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దామోదర రాజనర్సింహ అన్నారు. మండలంలోని నడిమితండాకు చెందిన సర్పంచ్ రంజిత్‌నాయక్‌తో పాటు 30 మంది శుక్రవారం దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు శేషారెడ్డి తదితరులున్నారు.

రేగోడ్(మెదక్): మండల కేంద్రం రేగోడ్ గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆ పార్టీ గ్రామ అధ్యక్షుడు శంకరప్ప, కోఆప్షన్ సభ్యుడు చోటుమియా తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్త హామీలే తప్ప చేసిందేమీ లేదని ఆరోపించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ సభ్యుడు యాదగిరి, పార్టీ మండలాధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావు, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాధకిషన్, మున్నూరు సంఘం నాయకుడు వెన్నెల రాజు, ప్రాథమిక పాఠశాల చైర్మన్ దశరథం తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో కేసీఆర్‌కు ఎదురులేదు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత



తూప్రాన్: గుండ్రెడ్డిపల్లిలో..

జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత

మనోహరాబాద్(తూప్రాన్): సీఎం కేసీఆర్‌కు గజ్వేల్‌లో ఎదురులేదని జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత అన్నారు. శుక్రవారం మండలంలోని కూచారంలో ఇంటింటి ప్రచారంలో రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ భూపతిరెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసీఆర్ ఎక్కడ పోటీ చేసినా ఎదురు లేదని, అందరూ కేసీఆర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పురం మహేశ్, తూప్రాన్ పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్‌లు నరేందర్‌రెడ్డి, నాగభూషణం, నర్సయ్య, నాయకులు పురం రవి, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, భిక్షపతి, నర్సింలుగౌడ్, నరేశ్ దాసరి, పెంటాగౌడ్, వెంకట్‌గౌడ్, వెంకటేశ్, నర్సింలు, జావీద్, ఇర్ఫాన్, రాహుల్, వెంకట్, నందు, ఉప సర్పంచ్‌లు రాజుయాదవ్, ధర్మేందర్, నవీన్‌చారి, తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా ఇంటింటా ప్రచార హోరు

తూప్రాన్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల సర్పంచ్‌లో ఫోరం అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ భగవన్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని దతార్‌పల్లి, గుండ్రెడ్డిపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర మాజీ ఫుడ్స్ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణగౌడ్, కిష్టారెడ్డి, అశోక్, రాజిరెడ్డి, నర్సమ్మ పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని పోతాన్‌పల్లి గ్రామంలో బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజిరెడ్డి, సర్పంచ్ అశోక్, నాయకులు భ్యాగరాజ్, శివ, లక్ష్మణ్, వేణుపంతులు, తానీషాతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి



రాంపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీపీఎం



శివ్వంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

- డీపీఎం మోహన్

అల్లాదుర్గం(మెదక్): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని ఐకేపీ డీపీఎం మోహన్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఏపీఎం నాగరాజు సీసీ బేతయ్య, ఇందిర, బల్‌రాంరెడ్డి, సంజీవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): పీఏసీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రం శివ్వంపేటతో పాటు గోమారం, దొంతి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండల ప్రత్యేక అధికారి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈ లావణ్య, సీఈఓ మధు ఉన్నారు.

సరైన నాయకులను ఎన్నుకోవాలి



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధ్యాపకులు

నర్సాపూర్ రూరల్: సమాజంలో మార్పు రావాలంటే ప్రతీ ఒక్కరు నిజాయితీగా ఓటు వేసి సరైన నాయకులను ఎన్నుకోవాలని ప్రిన్సిపాల్ రవీందర్ అన్నారు. స్వీప్ ఆధ్వర్యంలో శుక్రవారం నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఓటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు జ్యోత్స్నదేవి, కళింగరెడ్డి, నాగరాజు, మాధవి, రమాదేవి, రాజేశ్వర్, జానకి, పాతిమా, అమీనా, స్నేహ, బాసిత్‌అలీ, తాజొద్దీన్, ప్రదీప్‌రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాకారుల పొట్ట కొట్టొద్దు



మాట్లాడుతున్న కళాకారులు

నర్సాపూర్: ప్రభుత్వంలో సాంస్కృతిక సారథి కళాకారులుగా ఉపాధి పొందుతున్న కళాకారులు తమ పొట్టకొట్టొద్దని జజ్జనక కళాబృందం సభ్యులు కోరారు. శుక్రవారం ఈ సందర్భంగా కళాబృందం సభ్యులు రమేశ్, బాబా, ఆంజనేయులు, కృష్ణ, సతీశ్, మహేశ్, శంకర్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో తాము పాల్గొన్న తమకు ప్రభుత్వం నుంచి ఉపాధి దొరకలేదని వాపోయారు. నియోజకవర్గంలోని కొందరు కళాకారులకు సాంస్కృతిక సారథి కళాకారులుగా ఉపాధి అవకాశం లభించిందన్నారు. కాగా ప్రస్తుత ఎన్నికల సమయంలో కళాకారులకు రాజకీయ పార్టీల నుంచి కొంత ఉపాధి లభించే అవకాశం ఉందని చెప్పారు. కాగా ప్రభుత్వం నుంచి ఉపాధి పొందిన కొందరు కళాకారులు ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థుల వద్దకు వెళ్లి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టేందుకు తమకు అవకాశం కల్పించాలని అడగడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. తమ పొట్ట కొట్టే పనులకు పాల్పడొద్దని, సారథి కళాకారులు తమ వైఖరి మార్చుకొని పక్షంలో ప్రభుత్వ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

సంక్షిప్త వార్తలు

◆ 'బీఆర్ఎస్‌లో సరైన గుర్తింపు లేదు'



మనోహరాబాద్(తూప్రాన్): బీఆర్ఎస్ పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంతో పార్టీ మారినట్లు రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు మల్లేశ్ తెలిపారు. శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గం మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామ సర్పంచ్ మల్లేశ్ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ నుంచి ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఈటల కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారన్నారు. వీరి వెంట కాళ్లకల్ ఎంపీటీసీ-1 లావణ్య, నాయకులు నాగరాజు, శ్రీనివాస్, బాల్‌రాజ్ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ కన్వీనర్ రాంమ్మోహన్‌గౌడ్, బీజేపీ మండలాధ్యక్షుడు నరేందర్‌చారి, తదితరులు ఉన్నారు.

◆ ఊపందుకున్న ధాన్యం కొనుగోళ్లు

కొల్చారం(నర్సాపూర్): ఎన్నికల నేపథ్యంలో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఈసారి రైతుల నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఎనిమిది పీఏసీఎస్‌లు, మూడు ఐకేపీ కేంద్రాలను ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం నాటికి మండలంలో 2552.40 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. రంగంపేట పీఏసీఎస్ ద్వారా శుక్రవారం సాయంత్రం వరకు 21 మంది రైతుల నుంచి 4858 సంచులు ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సిబ్బంది తెలిపారు.

◆ కాంగ్రెస్‌లో చేరికలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని ఫైజాబాద్ గ్రామంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పండరి ఆధ్వర్యంలో మండలానికి చెందిన పలు గ్రామాల బీఆర్ఎస్ కార్యకర్తలు సుమారు 320 మంది, నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సాయిరెడ్డి, నాయకులు సుహాసినిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, శశికాంత్, బుచ్చిరెడ్డి, సుధీర్ రెడ్డి, భూమయ్య, విఠల్‌రెడ్డి, బాబురావు పాల్గొన్నారు.

◆ ఖాతాదారుల ఇబ్బందులు

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని దొంతి గ్రామంలోని ఆంధ్రాబ్యాంకు మేనేజర్ లీవ్‌లో ఉన్నాడు. దీంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు మేనేజర్ సూర్యకృష్ణ 20 రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో చికిత్స కోసం లీవ్‌లో ఉన్నాడు. ఇన్‌చార్జి బాధ్యతలు ఇతరులకు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

◆ యువకుడి ఆత్మహత్య

హవేళిఘనాపూర్(మెదక్): ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ముత్తాయికోట గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన బచ్చోళ్ల సుగుణ, సిద్ధయ్యల రెండో కుమారుడు ప్రవీణ్(22) ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. కొన్ని రోజులుగా పని మానేసిన ఆయన తాగుడుకు బానిసై ఖాళీగా ఉంటున్నాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు ఆరాతీస్తున్నారు.

◆ రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెద్దశంకరంపేట(మెదక్): జాతీయ ప్రధాన రహదారిపై మండలంలోని రాఘువానితండా శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా వడనెల్లి గ్రామానికి చెందిన అల్లాపూర్ భీమరయ్య(40) మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. బైక్‌పై వెళ్తున్న భీమరయ్యను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే భీమరయ్య మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు.